# ఒగ్గు కథ

## ఒగ్గు డోళ్ళ విన్యాసం

ఒగ్గు అనగా ఢమరుకం. వీరు ఒగ్గు మరియు డోళ్లను వాయిస్తూ నృత్యం చేస్తూవుంటారు. వీరు కుర్మకులస్థులు. వీరు శ్రీశైల మల్లన్న భక్తులు. వీరు ఒగ్గు వాయిస్తూ పూజలు (ప్రార్థనలు) చేస్తారు కాబట్టి వీరిని ఒగ్గు పూజారులు అంటారు. ఢమరుకాన్ని ప్రాంతీయభాషలో ఒగ్గు అని అంటారు. వీరు ఒగ్గు, డోళ్లు వాయిస్తూ నృత్యం చేస్తారు. శ్రీ మల్లిఖార్జునస్వామి వారికి లగ్నాలు చేస్తారు. శ్రీ రేణుకాదేవి అమ్మవారి లగ్నం చేస్తారు. వీరభద్రుడని లగ్నం అనగా వీరప్ప లగ్నం పెద్దఎత్తున చేస్తారు. ౨౦ నుండి ౩౦ మంది కలసిచేస్తారు. ౮ రోజులు చేస్తారు. బీరప్ప దేవుని పండగను కుర్మవాళ్లు తప్ప యింకెవ్వరూ చెయ్యరు. కుర్మవాళ్లుగా గొల్లకాపరులు పండుగచేసేటప్పడు గుడిదగ్గర గొర్రెలమంద ఉంటుంది. వీరప్ప పండుగను చేసేవారిని వీర్లవారిని, మల్లప్ప పండుగ చేసేవారిని ఒగ్గువారని అంటారు. వీరిద్దరూ కుర్మకులస్థులే.



ఒగ్గువారు అనగా పూర్తిగాతమకు తాము మల్లన్నకు సమర్పించుకొన్నవారని అర్థం కూడా ఉంది. వారు మల్లన్న దీక్ష తీసుకొంటారు. వీరు పూజారులుగా గానీ మల్లన్న కథలు చెప్పే వారుగాగానీ అనుమతిపొందుటకు ముందు ఒగ్గుపెద్ద ఒగ్గు మరియు త్రిశూలం ఇచ్చి అనుమతిస్తాడు. ఈ కార్యక్రమం శ్రీశైలం, వేములవాడ మొదలైన శైవదేవస్థానాలలో జరుగుతాయి. కథచెప్ప కథకుడు ఏడుగవ్వలు మెడలోవేసుకొనును.

దీనినే గవ్వలదర్శనం అందురు. ఇందుకు పూర్వకథ ఏమనగా శ్రీ భ్రమరాంబ యొక్క ఏడుగురు సోదరులు శ్రీ మల్లన్నతో వారి సోదరి వివాహసమయంలో యుద్ధం చేసిరి. వారిని మల్లన్న ఓడించి కుక్కలుకమ్మని శపించెను. మల్లన్నను భ్రమరాంబ అర్థించగా మల్లన్న కనికరించి వారిని ఒగ్గులుగా జన్మించి తన కథలనుచెప్పమని ఆదేశించెను. అందువలన ఏడుగురు సోదరులను 7 గవ్వల రూపంలో భావించి ఆ గవ్వలహారాన్ని మెడలో ధరించెదరు.

వీరు గ్రామాలు తిరుగుతూ శ్రావణమాసం నుండి సంక్రాంతి వరకు కథలుచెబుతారు. పెద్దవారి ఇంటిముందు కథచెప్పి ఇచ్చిన పారితోషికం తీసుకుంటారు. విడి రోజులలో గొర్రెలుకాయటం, కూలిపని చేసుకుంటూ ఉంటారు. 1973వ సంవత్సరం నుండి ఈ కళ ప్రభుత్వం దృష్టికివచ్చింది. ఒగ్గుకథ బాణీలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కథగా చెబుతూ గ్రామాలలో ప్రచారం చేస్తున్నారు. వీరు చెప్ప కథలు : మల్లన్నకథ, వీరప్పకథ, ఎల్లమ్మకథ, మాంధాతకథ, నల్లపోచమ్మకథ మరియు పార్వతీ కళ్యాణం మొదలైన 40 కథలు చెబుతారు. ఈ కథలన్నీ ముఖతః నేర్చుకున్నవేగానీ గ్రంథస్థం కాబడలేదు. ఒగ్గు కథ తెలంగాణ ప్రాంతములో ఎక్కువగా ప్రచారం లో ఉంది. వారిలో శ్రీ చుక్క సత్తయ్య బృందం మరియు అనేక బృందాలు ప్రదర్శనలు ఇచ్చి ఒగ్గు కథకు గుర్తింపు తీసుకొనివచ్చుచున్నారు.